ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5

అనంతపురం
జిల్లా వార్తలు
శుక్రవారం 24 జనవరి 2025

టమోటా కిలో రూ.12



అనంతపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 12తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.



లోకేశ్‌కు దేశవ్యాప్త కీర్తి

- పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ నేతలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు



అనంతలోని పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, ఆలం, గౌస్‌మొహిద్దీన్ తదితరులు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కష్టపడి ఎదుగుతూ దేశవ్యాప్త కీర్తిని సంపాదించారని టీడీపీ నాయకులు అన్నారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయం, రాంపురం ఎంజేపీ పాఠశాలలో విద్యార్థుల నడుమ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందించారు. నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ ముందుకు సాగుతున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవస్థను లోకేశ్ గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారని అన్నారు. ఏడు నెలల వ్యవధిలోనే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు.. (తరువాయి 6లో..)

బ్లాక్ స్పాట్స్ పరిశీలన



తాడిపత్రి వద్ద బ్లాక్ స్పాట్‌ను పరిశీలిస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బ్లాక్ స్పాట్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని డీటీసీ వీర్రాజు అన్నారు. జాతీయ రహదారి మాసోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాలోని 37 బ్లాక్ స్పాట్స్‌ను రవాణా, పోలీసు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పరిశీలించారు. తాడిపత్రి పరిధిలో అర్జా సిమెంట్ ఫ్యాక్టరీ, రావి వెంకటాంపల్లి, చుక్కలూరు సమీపంలోని బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదాల గురించి ఆరా తీశారు. ఇకపై ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. రాయదుర్గం ఆర్టీఓ రమేష్, ఎంవీఐలు శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి స్థానిక అధికారులతో కలిసి మరూరు టోల్ ప్లాజా, అనంతపురం నగర శివారులోని బళ్లారి రోడ్డు, గుత్తి రోడ్డు వద్ద బ్లాక్ స్పాట్స్‌ను పరిశీలించారు. గార్లదిన్నె మండల పరిధిలోని జాతీయ రహదారిపై ఇల్లూరు, తలగాసిపల్లి క్రాస్‌ల వద్ద బ్లాక్ స్పాట్స్‌ను ఎంవీఐ సునీత పరిశీలించారు. బ్లాక్ స్పాట్స్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఈ నెల 31న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశంలో నివేదికలు సమర్పిస్తామని డీటీసీ తెలిపారు.

పెద్దింట పుట్టిన పేదల మనిషి

విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలు.. రైతు, కార్మిక సమస్యలపై పోరాటం

న్యాయవాదిగా, మార్క్సిస్టుగా తనదైన ముద్ర

నేడు జడ్ వీరారెడ్డి వర్ధంతి

7



పేట్రేగిపోతున్న దొంగలు
తాళం వేసిన ఇళ్లే టార్గెట్..

బాల్య వివాహాలపై చర్యలు తీసుకోండి: కలెక్టర్



అనంతపురం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులు, పోలీసులను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం బాల్య వివాహాల నివారణపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో 2023 జూలై నుంచి ఇప్పటివరకు 544 బాల్య వివాహాల కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇందులో 10 ఎఫ్ఐఆర్‌లు అయ్యాయని తెలిపారు. ఈ కేసులలో 28 మందిని బైండోవర్ చేయాల్సి ఉండగా 24 మందిని మాత్రమే బైండోవర్ చేశారని, మిగిలినవారిని ఎందుకు బైండోవర్ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఆ నలుగురిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. గ్రామాలలో 15 రోజులలోపు నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు సమన్వయంతో సాగాలని సూచించారు. చిన్న వయసులో బాలికలు గర్భం దాల్చడం వల్ల కలిగే అనర్థాల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. గత సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. క్రమశిక్షణతో పనిచేయాలని హెచ్చరించారు. సమీక్షలో డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీ దేవి, డీఈఓ ప్రసాద్ బాబు, డీవీఈఓ వెంకటరమణ నాయక్, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ, బీసీ వెల్ఫేర్ అధికారి కుష్బూ కొఠారి, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలి

భూముల రీ సర్వేని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల వేదికలో వచ్చిన అర్జీలు, ఫ్రీ హోల్డ్, ఆర్ఓఆర్ హోల్డ్ భూములు, 22ఏ నుంచి తొలగించిన భూముల రీ వెరిఫికేషన్ తదితర అంశాలపై డీఆర్వో, ఆర్డీఓలు, తహసీల్దారు, సర్వేయర్లు, రిజిస్ట్రార్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఇప్పటి వరకు 198 గ్రామాలలో రీసర్వే పూర్తి అయిందని, 31 పైలెట్ గ్రామాలలో రీసర్వే పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. రైతులకు సమాచారం ఇచ్చి, అవగాహన కల్పించాలని, రైతుల భూముల రికార్డుల ఆధారంగా కొలతలు వేయాలని సూచించారు. ఈ విషయంలో డిప్యూటీ తహసీల్దార్లదే పూర్తి బాధ్యత అని అన్నారు. రీ సర్వేలో జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని అన్నారు.





బెల్టు తీసేదెవరు..?
- ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు 223
- బెల్టు షాపుల సంఖ్య 1200కు పైమాటే..

నియంత్రణ పట్టదా..? 7



స్టేషన్ నుంచి బయటకు వెళ్తున్న దున్నపోతు

అమ్మోరికి వదిలిన రెండు దున్నపోతుల్లో ఒకటి మాయమైంది. ఉన్న ఒక్కదానికోసం రెండు ఊర్ల మధ్య వివాదం తలెత్తడంతో అదికూడా బతికిపోయింది. ఒకటోది ఉన్నింటే.. జాతరలో రెండూ బలి అయ్యేవి. కూడేరు మండలం కడదరకుంట, ముద్దలాపురం గ్రామాల్లో ఊరి దేవరలో ముగియడంతో పోలీసుల అధీనంలో ఉన్న రెండో దున్నపోతు గురువారం విడుదలైంది. అంతకు మునుపు రెండు గ్రామాల ప్రజలతో సీఐ రాజు చర్చించారు. దున్నపోతును విడుదల చేస్తున్నామని, భవిష్యత్తులో దాన్ని బలి ఇచ్చేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దున్నపోతు స్వేచ్ఛకు భంగం కలిగించబోమని రెండూళ్ల ప్రజలు హామీ ఇచ్చారు. దీంతో దాదాపు 15 రోజులుగా కూడేరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న దున్నపోతు 'జంతుజీవన స్రవంతి'లో కలిసిపోయింది.

- ఆంధ్రజ్యోతి, కూడేరు

మట్టి తవ్వకాల వివాదం

టిప్పర్‌ను ధ్వంసం చేసిన చంద్రదండు

ముగ్గురిపై కేసు నమోదు చేసిన పోలీసులు



పగిలిన టిప్పర్ అద్దాలు

పుట్లూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏ. కొండాపురం శివారులో జాతీయ రహదారి 544-డి కోసం మట్టిని తవ్వడం గొడవకు దారితీసింది. మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను చంద్రదండు నాయకులు గురువారం ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. చంద్రదండు రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, ఆయన కుమారుడు సాయిచరణ్, చంద్రదండు నాయకులు నందకిషోర్, కొండపై పోలీసులు కేసు నమోదు చేశారు. జాతీయ రహదారి కోసం గ్రామ శివారులో ఉన్న కొండమట్టిని రవాణా చేస్తుండగా చంద్రదండు నాయకులు అడ్డుపడి, టిప్పర్‌ను పగలగొట్టారని ఎస్ఐ వెంకటనరసింహ తెలిపారు. టిప్పర్ యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు. ఈ వివాదంపై చంద్రదండు ప్రకాష్‌నాయుడు స్పందించారు. తమ పంచాయతీ అనుమతులు లేకుండా కొండమట్టిని రవాణా చేస్తున్నారని ఆయన అన్నారు. కొండమట్టిని తవ్వుతున్న కారణంగా కొండాపురం, అరకటవేముల, సూరేపల్లి గ్రామాల పశువులకు మేత కరువు అవుతుందని అన్నారు. పాడిపరిశ్రమ అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. ఈ గ్రామాల రైతులు పశువులను కొండపైకి మేతకోసం తీసుకువస్తారని తెలిపారు. చింతకుంట దగ్గర ఏకంగా బ్లాస్టింగ్ పెట్టి కొండను ధ్వంసం చేస్తున్నారని అన్నారు. బ్లాస్టింగ్ చేసే ముందు ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. వైసీపీ పాలనలో కొండ ప్రాంతాల్ని తవ్వేసి సొమ్ము చేసుకున్నారని తెలిపారు. అప్పట్లో ఈ విషయంపై ప్రశ్నించినందుకు అనంతపురంలో తనపై దాడి చేశారని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు.

మత్తు బడి
విచ్చలవిడిగా పొగాకు ఉత్పత్తుల వినియోగం..
పాఠశాల ఆవరణలో గుంపులుగా.. గుప్పు గుప్పు 6



లోకేశ్‌కు దేశవ్యాప్త కీర్తి

(5వ పేజీ తరువాయి)

కల్పించారని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, దాదు, రామక్రిష్ణ, లక్ష్మీనారాయణ రెడ్డి, అడదాకులపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

● డి.హీరేహాళ్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి, తన భవిష్యత్తును వదులుకుని, తాత ఎన్టీఆర్ ఆశయాల సాధనకు లోకేశ్ కృషి చేస్తున్నారని కాలవ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని, వాటినే విజయానికి మెట్లుగా మార్చుకున్నారని, దేశ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్టలను సొంతం చేసుకున్నారని అన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర అభివృద్ధి బాధ్యతలను మోస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా పేరు సంపాదించారని అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

2500 మంది రక్తదానం

లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కళ్యాణదుర్గంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో 2500 మందికి పైగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం బర్త్‌డే కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. రక్తదానం చేసినవారికి రూ.లక్ష ప్రమాద బీమా వర్తింపజేస్తూ, బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం 10 వేల మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తూ, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నారా లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెడ్‌క్రాస్ సొసైటి, ఆర్డీటీ సిబ్బంది, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● టీడీపీ అనంతపురం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ముంటిమడుగు కేశవరెడ్డి, గంజే నాగరాజు తదితరులు కేక్ కట్ చేశారు. నాయకులు సరిపూటి రమణ, గంగారామ్, కూచి హరి, స్వామిదాస్, నారాయణస్వామి యాదవ్, కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, పీఎం లక్ష్మీప్రసాద్, స్వప్న, సంగా తేజస్విని, కంఠాదేవి తదితరులు పాల్గొన్నారు.

● మంత్రి నారా లోకేశ్ బంగారు భవిష్యత్తు ఉన్న నాయకుడని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. నారా లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్లు కేజీబీవీ పాఠశాలలో వేడుకలను నిర్వహించారు.



వెంకటాపురంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

● రాష్ట్ర భవిష్యత్తుకోసం పరితపిస్తున్న నాయకుడు లోకేశ్ అని ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌కట్ చేసి, లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఎన్టీఆర్ మనవడు, చంద్రబాబు కుమారుడిగా కాకుండా, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు.



కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

● మడకశిర ఒకేషనల్ కళాశాల ఆవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కేక్‌కట్ చేశారు. రాష్ట్రాన్ని లోకేశ్ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంచి, స్వతహాగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. వేడుకలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న నీటి వనరులను వినియోగించుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్ అన్నారు. గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో శాఖపరంగా చేపడుతున్న పలు పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏబీఆర్, మిడ్‌పెన్నార్, గండికోట జలాశయాల నుంచి ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు అనుగుణంగా దాదాపు రూ.50 కోట్లతో డీపీఆర్ తయారు చేయడం జరిగింది. మరో రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు.

మత్తు బడి

- విచ్చలవిడిగా పొగాకు ఉత్పత్తుల వినియోగం
- పాఠశాల ఆవరణలో గుంపులుగా.. గుప్పు గుప్పు
- మద్యం సేవించి బడికి వస్తున్న కొందరు బాలలు
- దండిస్తే.. గురువులపై తిరగబడుతున్నారు
- తల్లిదండ్రులు మేల్కోకపోతే భవిష్యత్తు బుగ్గి

అనంతపురం విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం మత్తులో పడుతోంది. విద్యార్థి దశలోనే విషతుల్యం అవుతోంది. పొట్ట కూటి కోసం తిప్పలు పడే తల్లిదండ్రులు.. తమ బిడ్డల బతుకులైనా బాగుపడాలని బడికి పంపితే.. అక్కడ మత్తు రక్కసి కబలిస్తోంది. కొన్ని పాఠశాలల ఆవరణలోనే బీడీ, సిగరెట్, గుట్కా వినియోగం జరుగుతోంది. మరికొందరు మద్యం కూడా తాగుతున్నారు. ఉపాధ్యాయులు దండిస్తే ఎదురు తిరుగుతున్నారంటే.. పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, కాలేజీలకు 300 అడుగుల పరిధిలో మత్తు పదార్థాల అమ్మకం నిషిద్ధం. కానీ కొందరు దొంగచాటుగా, మరికొందరు బహిరంగంగా విక్రయిస్తున్నారు. 2024-25 యూడైస్ ప్రకారం జిల్లావ్యాప్తంగా 2,417 పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,99,293 మంది విద్యార్థులు, 14,881 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉమ్మడి జిల్లా పర్యటనకు శుక్రవారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలలో అసాంఘిక కార్యకలాపాలపై కథనం.

బడి సంచిలో..


బడికి వెళ్లే విద్యార్థులు సంచిలో పుస్తకాలతో పాటు చిరుతిండ్లను తీసుకువెళ్లడం పరిపాటి. కానీ కొందరు చైనీ ఖైనీ, రాజా, హన్స్, గట్కా వంటి మత్తు పదార్థాలను తెచ్చుకుంటున్నారు. పొగాకు పదార్థాలను తరగతి గదుల్లోనే వినియోగిస్తున్నారు. మరికొందరు మద్యం సేవించి బడికి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం, విశ్రాంతి సమయాలలో పాఠశాల ఆవరణలో వైటనర్ వంటివి బట్టలో పెట్టుకుని పీలుస్తున్నారు. ఇవి ఎంత ప్రాణాంతకమో తెలియక.. మత్తుకు బానిసలు అవుతున్నారు. కొన్ని పాఠశాలల వద్ద గుంపులుగా చేరి సిగరెట్లు తాగుతున్నారు. ఇలాంటి దృశ్యాలు జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సర్వసాధారణంగా మారాయి. కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో సైతం విద్యార్థులు మద్యం తాగుతున్నారు. టీచర్లు దండిస్తే ఎదురుతిరుగుతున్నారు. తల్లిదండ్రులు జీవనపోరాటంలో తీరకలేకుండా ఉండి.. పిల్లలపై నిఘా వేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

ఇక్కడ విచ్చలవిడి..

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు మత్తులో పడ్డారు. అంబేడ్కర్ నగర్, టీవీ టవర్, బుడ్డప్పనగర్, నవోదయ కాలనీ ప్రాంతాల విద్యార్థులలో కొందరు దురలవాట్లకు బానిసలయ్యారు. అనంతపురం రూరల్ ప్రాంతంలోని కొన్ని కాలనీల విద్యార్థులు, కూడేరు, నార్పల, శింగనమల, జిల్లా సరిహద్దు మండలాల్లోని కొందరు విద్యార్థులు తరచూ 'మత్తు'గా బడికి వస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దండిస్తే తమకు, ప్రధానోపాధ్యాయులకు సైతం ఎదురు తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొందరు టీచర్లు, పీడీలు ఒకసారి మందలించి వదిలేస్తున్నారు. తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసినా పిల్లలల్లో మార్పు కనిపించడం లేదని అంటున్నారు.



అనంతపురంలోని ఓ పాఠశాలకు మద్యం సేవించి వచ్చి తరగతి గదిలో పడిపోయిన విద్యార్థి (ఫైల్)



ఖైనీ వినియోగం కారణంగా విద్యార్థి నోటిలో ఏర్పడిన పుండ్లు

ప్రమాదకరం

బాల్యంలో పొగాకు, గుట్కా, మద్యం వినియోగం అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మత్తు పదార్థాలు వాడేవారికి నోటి, గొంతు జబ్బులు వస్తున్నాయని అంటున్నారు. పొగాకు వినియోగంవల్ల అనేక రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. పక్షవాతం, అంధత్వం, చిగురు వాపు, ఆయాసం, రక్తనాళాలు గడ్డలు కట్టడం, ఎముకలు బలహీనపడటం, భవిష్యత్తులో సంతానోత్పత్తి శక్తి తగ్గడం వంటి దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయి. నోరు, ఊపిరితిత్తులు, తల, జీర్ణాశయం, మూత్రనాళాలపై పొగాకు ఉత్పత్తులు దుష్ప్రభావం చూపుతాయి.



అవగాహన కల్పిస్తున్నాం..

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధ్యాయులు, హెచ్ఎంలకు సూచనలు ఇచ్చాం. ఇటీవల పాఠశాలల్లో యాంటి డ్రగ్ యాక్టివిటీస్ నిర్వహించాం. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 1,030 ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేశాం. వాటి ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్నాం. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం జరుగుతుంటే.. పోలీసుల సహకారంతో అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

నేడు విద్యాశాఖ కమిషనర్ రాక

జేఎన్టీయూలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం

అనంతపురం విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు శుక్రవారం అనంతపురం జిల్లాకు రానున్నారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డీఈఓ లు, డిప్యూటీఈఓలు, ఎంఈఓలు -1, 2లతో సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం, జీఓ 117 రద్దు, ప్రత్యామ్నా య ఏర్పాట్లు, ఇతర చర్యలు తదితర అంశాలపై సమావేశంలో కమిషనర్ దిశానిర్దేశం చేయనున్నారు.

జిల్లాకు ఆర్‌జేడీ శామ్యూల్

పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ గురువారం మధ్యాహ్నం అనంతపురం జిల్లాకు చేరుకున్నారు. కమిషనర్ పర్యటన నేపథ్యంలో ఆయన జిల్లాకు వచ్చారు. ఉద్యోగోన్నతి పొంది రెగ్యులర్ ఆర్‌జేడీ అయ్యాక శామ్యూల్ తొలిసారి జిల్లాకు రావడంతో పలు సంఘాల నేతలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ కార్యాలయంలో ఉన్న ఆయనను అనంతపురం జిల్లా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు, ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా, ఉపాధ్యాయ సమస్యలను ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లారు.

వందేళ్లయినా రవి పేరు ప్రతిధ్వనిస్తుంటుంది

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వందేళ్లయినా పరిటాల రవి పేరు ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ అన్నారు. గురువారం పరిటాల రవీంద్ర వర్ధంతికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం వెంకటాపురంలో జరగనున్న పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగను పరిటాల రవి ఎంతో బాగా జరిపే వారని, పిల్లలతో సరదాగా ఉండేవారన్నారు. పండుగ అయిన వారం రోజుల తరువాత హత్యకు గురికావడాన్ని ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నామన్నారు. ఆయన తమపై పెద్ద బాధ్యతలు పెట్టారని వాటిని నెరవేర్చేదిశగా చివరికి వరకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎన్టీఆర్, పరిటాల రవి లాంటి వారు బతికినన్ని రోజులు ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని, అలాంటి వారిని వందేళ్లయినా మరువరన్నారు. వర్ధంతికి వచ్చే ప్రతి ఒక్కరు జాగ్రత్తగా రావాలని సూచించారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు తెలంగాణా, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. ఎంతమంది వచ్చినా అందరికి బోజనం అందించేలా చర్యలు తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో పార్కింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు పరిటాలఘాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరిస్తున్నారు. నిమ్మలకుంట కళాకారులతో తోలుబొమ్మల ప్రదర్శన కూడా ఏర్పాటుచేశారు. పరిటాల రవీంద్ర కోడళ్లు పరిటాలజ్ఞాన, పరిటాల తేజస్వి పొయ్యిల వద్ద పూజలు చేసి వంటకాల తయారీని ప్రారంభించారు.



ఘాట్‌కు అలంకరించే పూలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రైతులకు జేసీ శివనారాయణ శర్మ సూచన

ఉరవకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తామని జేసీ వివరించారు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మాట్లాడుతూ అన్ని మండలాల్లో త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులందరూ కొనుగోళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏడీఏ పద్మజ, ఏఓ శుభకర్, పీఏసీఈఓ గౌస్, ఏఎంసీ సెక్రటరీ నారాయణ స్వామి పాల్గొన్నారు. కాగా మంత్రి కేశవ్ చొరవతోనే కొనుగోలు ప్రారంభించడం జరిగిందని ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు అన్నారు.



కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ, టీడీపీ నాయకులు

నేటి నుంచి కందుల కొనుగోలు ప్రారంభం

● ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 కేంద్రాల్లో శుక్రవారం నుంచి కందులు కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి దాకా 2 వేల మంది రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. క్వింటా కంది కనీస మద్దతు ధర రూ.7550లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 12 శాతంలోపే తేమ ఉంటేనే కందులు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోల కేంద్రాల నిర్వాహకుల నుంచి రైతులకు ముందస్తుగా ఏయే తేదీల్లో సరుకు తీసుకురావాలన్న సమాచారం ఇస్తారని, ఆ సమాచారం మేరకు నిర్ణయించిన తేదీల్లో రైతులు సరుకు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా ఎవ్వరూ సరుకును తీసుకురాకూడదన్నారు. ఇప్పటికీ మిగతా రైతులు కూడా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కంట్రోల్ సెల్‌లోని 8500292992, 8978381841 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టేలా చూడాలని స్క్వాడ్ డీఎఫ్ఓ గురుప్రభాకర్ ఆదేశించారు. గురువారం స్క్వాడ్ రేంజర్ చంద్రశేఖర్‌తో కలిసి అనంతపురం రేంజర్ పరిధిలోని శింగవరం, మరుట్ల సౌత్, మరుట్ల నార్త్ బీట్లలో నాటిని మొక్కలను పరిశీలించారు. ప్రస్తుతం నాటిన మొక్కలకు ఎలాంటి సమస్యా లేనప్పటికి వేసవిలో సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్లు ప్రతాప్, రవిచంద్రారెడ్డి, నారాయణ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

బి-ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బి-ఫార్మసీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు గురువారం తెలిపారు. డిసెంబరులో తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు, తృతీయ, ద్వితీయ సెమిస్టర్ల (ఆర్19, 15), తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయని తెలిపారు. వీటి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఈసీ ప్రొఫెసర్ శివకుమార్, ఏసీఈలు ప్రొఫెసర్ శేఖర్‌రాజు, డాక్టర్ అంకారావు, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు...

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ పరీక్షల ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తన చాంబర్‌లో విడుదల చేశారు. విద్యార్థులు ఫలితాల వివరాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈ లలితకుమారి, మాధవి పాల్గొన్నారు.

2047 నాటికి రొబోటిక్ అగ్రికల్చర్ విధానం

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తే 2047కి రోబోటిక్ అగ్రికల్చర్ విధానం వస్తుందని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత అన్నారు. గురువారం ఎస్కేయూలోని సామాజిక సమ్మిళిత అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధికి వ్యవసాయ రంగం-అనుబంధ రంగాల వ్యూహాలు' అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఉత్పత్తి, మార్కెట్ సౌకర్యాలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలపై పశుసంవర్ధకశాఖ శాస్త్రవేత్త కృష్ణమూర్తి, అగ్రికల్చర్ ఏడీ యల్లప్ప రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డైరెక్టర్ జీవీ రమణ, సామాజిక సమ్మిళిత అధ్యన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రీసర్చ్ అసిసెంట్లు కొండారెడ్డి, పద్మావతి, ప్రొఫెషనల్ అసిస్టెంట్ క్రిష్ణారెడ్డి, సిబ్బంది ప్రశాంత్‌రెడ్డి, నర్మద, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో శనివారం నుంచి కంప్యూటర్ ట్యాలీ ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన చదవడం, రాయడం వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులన్నారు. 30రోజులపాటు నిర్వహించే శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అండర్-23 జిల్లా జట్ల ఎంపిక పోటీలు శనివారం సాయంత్రం 5గంటలకు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28వతేదీ నుంచి 31వతేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-23 బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9393711324ను సంప్రదించాలని కోరారు.

రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు యాద్గిర్ స్టేషన్‌లో హాల్ట్

గుంతకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హజ్రత్ నిజాముద్దీన్ (న్యూఢిల్లీ) నుంచి బెంగళూరు మధ్యన తిరిగే రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691/92)కు యాద్గిర్ స్టేషన్‌లో హాల్ట్‌ను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 28 నుంచి, తిరుగు ప్రయాణపు రైలుకు 29వ తేదీ నుంచి యాద్గిర్ స్టేషన్‌లో రెండు నిమిషాల సేపు స్టాపింగ్ కల్పించినట్లు తెలియజేశారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ స్టాపింగ్‌ను కొన్ని నెలల తర్వాత పునఃసమీక్షిస్తారు.

'ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి'

అనంతపురం క్లాక్‌టవర్/బత్తలపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యానికి అందరూ ప్రాధాన్యమివ్వాలని ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నెఫెర్రర్ సూచించారు. గురువారం అన్రామారథాన్ బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆనందం, ఆశ జీవితానికి అవసరమన్నారు. క్రీడలు, సంప్రదాయాలు మన జీవన ప్రమాణాలకు అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, చైర్మన్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

నలుగురు బీఎల్‌ఓలకు అవార్డులు

అనంతపురం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ఎన్‌రోల్‌మెంట్‌లో అత్యంత ప్రతిభ కనపరిచిన బీఎల్‌ఓలకు కేంద్ర ఎన్నికల కమిషన్ బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు- 2024ను ప్రకటించింది. అందులో అనంత ఉమ్మడి జిల్లాలో నలుగురు బీఎల్‌ఓలు ఈ అవా ర్డుకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లాలో రాప్తాడు నియోజక వర్గానికి చెందిన వి. రూపా తేజశ్విని, రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన సి. అంజలి ఎంపికయ్యారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం నియోజకవర్గానికి చెందిన కేఎస్ గుణశేఖర్, పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన బి. రమాదేవి ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం అవార్డులను అందించి అభినందించనున్నారు.

పట్ట పగలే రెండిళ్లలో చోరీ



దొంగలు తెరిచిన బీరువా

శింగనమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి గ్రామంలో గురువారం పట్టపగలే రెండిళ్లలో చోరీ చేశారు. గ్రామానికి చెందిన నారాయణస్వామి, రామయ్య ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పక్కపక్కనే ఉన్న వారిళ్లలోకి చొర బడ్డారు. నారాయణస్వామి ఇంట్లోని బీరువాలో ఉన్న 12 తులాల బంగారం ఆభరణాలు, రామయ్య ఇంట్లో రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటికి గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య ఎస్ఐ విజయ్‌కూమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులు సాయంత్రం శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం 801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద ఫేజ్-2కు 452 క్యూసెక్కులు వెళ్తున్నట్లు తెలిపారు.

పెద్దింట పుట్టిన
పేదల మనిషి

ధనిక రైతు కుటుంబంలో జన్మించినా.. పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన నాయకుడు జడ్ వీరారెడ్డి. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంచుకున్న ఆయన.. మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేసి, కమ్యూనిస్టు భావజాలంతో ముందుకు సాగారు. రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, సమితి ప్రెసిడెంట్‌గా ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడిపారు. శుక్రవారం ఆయన వర్ధంతి నేపథ్యంలో.. ప్రత్యేక కథనం. - ఆంధ్రజ్యోతి, గుత్తి

• విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలు • రైతు, కార్మిక సమస్యలపై పోరాటాలు



న్యాయవాదిగా, మార్క్సిస్టు నేతగా తనదైన ముద్ర
నేడు జడ్ వీరారెడ్డి వర్ధంతి

విద్యార్థి దశలోనే...

ప్రజలు గుత్తి తాలూకా పెద్దవడుగూరులో జన్మించిన వీరారెడ్డి, విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలవైపు ఆకర్షితులయ్యారు. ఆ తరువాత కమ్యూనిస్టు ఉద్యమకారుడిగా మారారు. పరిసరాల పరిశుభ్రత, గ్రంథాలయాల నిర్వహణ, దళితుల అభ్యున్నతి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థి దశలో తన స్నేహితుడు కె.రామకృష్ణరెడ్డితో కలిసి శ్రమదానం చేసేవారు. ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచారు. ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలో మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. చదువు, క్రీడలు, రాజకీయ చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు.



జడ్ వీరారెడ్డి కాలనీలో నిర్మించుకున్న గృహాలు

రైల్వే కార్మికుల కోసం..

గుత్తి రైల్వే జంక్షన్‌గా ఉండటంతో, అక్కడ పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం పని చేశారు. అప్పటి జిల్లా నాయకులు వీకే ఆదినారాయణరెడ్డితో కలిసి కార్మికులను కూడగట్టి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే కార్మికులకు చట్టబద్ధంగా దక్కాల్సిన ప్రయోజనాల కోసం కోర్టుల ద్వారా, ప్రత్యక్ష పోరాటాల ద్వారా పాటుపడ్డారు. రైతు నేతగా, పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు తదితర సమస్యలపై పోరాటాలు కొనసాగించారు. తన 67 సంవత్సరాల వయస్సులో కూడా ఆయన పట్టు రైతులను సమీకరించేందుకు హిందూపురం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉద్యమంలో పాల్గొని, పోలీసుల లాఠీచార్జిలో గాయపడ్డారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పర్యటించి, రైతులను సంఘటితం చేశారు.



జడ్ వీరారెడ్డి కాలనీ

ప్రేమ వివాహం

అనంతపురానికి డాక్టర్ ఆదిలక్ష్మిని జడ్ వీరారెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 1964 ఆగస్టు 15న వీరి వివాహం జరిగింది. డాక్టర్ ఆదిలక్ష్మి మొదట గుంతకల్లు ఈఎస్ఐ ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారు. ఆ తరువాత గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. గ్రామీణ ప్రాంత మహిళల ఆరోగ్యం కోసం పాటుపడ్డారు. 'డాక్టరమ్మ.. ఆదిలక్ష్మమ్మ..' అని ఇక్కడి జనం ఆమెను గౌరవంగా పిలుచుకునేవారు. 2001లోడాక్టర్ ఆదిలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. తన స్వగ్రామం పెద్దవడూగురులో ఆమెను ఖననం చేశారు. భార్య సమాధి పక్కనే అప్పట్లోనే ఆయన ఆయన సమాధిని నిర్మించుకున్నారు.

మార్క్సిస్ట్ పార్టీ నిర్మాణానికి కృషి

జిల్లాలో మార్క్సిస్ట్ పార్టీ నిర్మాణానికి 1985 నుంచి జడ్ వీరారెడ్డి తన వంతు కృషి చేశారు. 2002లో సీపీఎం రాష్ట్ర మహాసభలు అనంతపురంలో జరిగాయి. సభ విజయవంతానికి ఆయన కృషి చేశారు. సీపీఎంలో సీనియర్ నాయకుడైనా.. ఆయనలో ఎక్కడా అలాంటి భావం కనిపించేది కాదు. యువకులను ప్రోత్సహించేవారు. అందరితో కలిసి మెలసి ఉండేవారు. చివరి వరకు సీపీఎం నాయకుడిగా, రైతు సంఘం నేతగా సేవలందించిన జడ్ వీరారెడ్డి, జనవరి 24, 2005లో గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. భార్య పక్కన ఆయన ఎంచుకున్న స్థలంలోనే ఖననం చేశారు. ఆయన పేరిట గుత్తి పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని సీపీఎం నేతలు నిర్మించారు. గుత్తి పట్టణ శివారులో సీపీఎం ఆధ్వర్యంలో 300 మంది పేదలకు పోరాటాల ద్వారా ఇంటి స్థలాలను ఇప్పించారు. ఆ కాలనీకి 'జడ్ వీరారెడ్డి కాలనీ'గా నామకరణం చేశారు. అనేక మంది పేదలు ఇళ్లను నిర్మించుకుని అక్కడ ఉంటున్నారు.

ప్రజాసేవే పరమావధిగా..

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించిన ఆయన, 1961లో లా పూర్తిచేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. వృత్తికి పరిమితం కాకుండా, ప్రజా ఉద్యమాల్లో కొనసాగారు. 1978 సీపీఐ తరుపున గుత్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం గుత్తిలో స్థిరపడి, రైతు సమస్యలపై సంఘాల ద్వారా పోరాటాలు చేశారు. 1981లో జరిగిన సమితి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. సమితి అధ్యక్షుడిగా గుత్తి తాలూకాలో విస్తృతంగా పర్యటించారు. గ్రామాలలో పాఠశాలలు ఏర్పాటు చేయించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు విశేషంగా కృషి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం పోరాటాలు చేసి అభివృద్ధి పనులకు నిధులు తెప్పించారు. దీంతో గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీకి మంచి సంబంధాలు ఏర్పాడ్డాయి.

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా కరెంటు సరఫరా.. విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



ట్రాన్స్ ఫార్మర్‌పై లైన్‌మన్ మృతదేహం, శివకుమార్ (ఫైల్)



అగళి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం నిండుప్రాణాన్ని బలిగొంది. కరెంటు సరఫరా నిలిపివేతలో నిర్లక్ష్యం కారణంగా లైన్‌మన్ విద్యుదాఘాతంతో మరణించాడు. మండలంలోని కురసాంగనపల్లి సమీపాన రైతు నగేశ్ పొలంలో గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో లైన్‌మన్ శివకుమార్ (47) అక్కడికక్కడే మరణించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కాలిపోయాడు. ఎస్ఐ వీరేష్, లైన్‌మన్ కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొళ్లకు చెందిన శివకుమార్ రామనపల్లి లైన్‌మన్‌గా పనిచేస్తుండేవాడు. కురసాంగనపల్లి సమీపాన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులకు ఉపక్రమించాడు. ఎల్‌సీ తీసుకుని ఫ్యూజు వేస్తుండగా సబ్‌స్టేషన్ ఆపరేటర్ రాకేష్ నిర్లక్ష్యంగా విద్యుత్ సరఫరా చేశాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి లైన్‌మన్ శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న లైన్‌మన్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. అతడికి భార్య మాలతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాలతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధ్యులపై చర్యలు తప్పవు

సమాచారం అందుకున్న విద్యుత్ శాఖాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. లైన్‌మన్ మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏడీ నాగన్న మాట్లాడుతూ.. నిర్లక్ష్యం తో లైన్‌మన్ శివకుమార్ మృతికి కారణమైన చర్యలు తీసుకుంటామన్నారు. లైన్‌మెన్ కుటుంబాన్ని సంస్థ తరఫున ఆదుకుంటామన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



లక్ష్మీనారాయణ (ఫైల్)

నల్లమాడ, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసకవంకపల్లికి చెంది న కౌలు రైతు లక్ష్మీనారాయణ (45) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనారాయణ మూడెకరాలు కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. పంట లు చేతికి అందక నష్టపోతుండేవాడు. అప్పులు పెరగడం, కుటుంబ పోషణ భారం కావడతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లోనే ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, మరణించాడు. రైతు భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రైతుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు మృతదేహాన్ని కదిరికి తరలించారు.

క్రిష్ణాపురంలో టీడీపీ కార్యకర్త...



సుందరరాజు

బుక్కపట్నం, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుందరరాజు(35) అప్పుల బాధ భరించలేక గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుందరరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అతడి భార్య శాంతి కొన్నేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. ఆమె వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, పిల్లల చదువుకోసం సుందరరాజు రూ.5 లక్షలు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి చుట్టుపక్కలవారు గమనించారు. అప్పటికే అతడు మరణించాడు. సుందరరాజు తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. సుందరరాజుకు ఇంటర్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. యజమాని మృతితో కుటుంబం వీధిన పడింది.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

గుంతకల్లుటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీఎస్ఐ మహేంద్ర గురువారం తెలిపారు. మృతుడికి 30 ఏళ్ల ఉంటాయన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేట్రేగిపోతున్న దొంగలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. బెంబేలెత్తిపోతున్న ప్రజలు

ఊళ్లకు వెళ్లాలంటే జంకుతున్న వైనం
పోలీసు వ్యవస్థ నిద్రమత్తు వీడేదెన్నడో?



తాడిపత్రి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిత్యం దొంగలు పేట్రేగిపోతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల్లో వారంరోజుల వ్యవధిలోనే వరుస చోరీలు జరిగాయి. పదికి పైగా ఇళ్లల్లో దొంగలు చోరీకి తెగబడ్డారు. తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. కొన్నిసార్లు పట్టపగలే ఇళ్లల్లోకి చొరబడి చోరీకి తెగబడుతున్నారు. ఈ సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పండుగలకు ఊళ్లకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాధారణంగా రాత్రి సమయాల్లోనే దొంగలు తమ కానిస్తుంటారు. కానీ పోలీసుల ఉదాసీన వైఖరివల్ల దొంగలు పేట్రేగిపోతున్నారు. వారంరోజుల్లో దొంగతనాలను పరిశీలిస్తే.. పట్టణంలోని భగత్ సింగ్‌నగర్‌లోని పది ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఒక ఇంటిలో దొరికిన చిన్నచిన్నవస్తువులతోపాటు ఐదు తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న షాపులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. యల్లనూరు రోడ్డు షాపుల్లో కూడా చోరీలు జరిగాయి. సుంకులమ్మపాలెంలో ఒకేరోజు ఆరుఇళ్లల్లో చోరీ జరగగా మూడిళ్లల్లో రూ.20వేల వరకు నగదు అపహరణకు గురైంది. శ్రీనివాసపురంలో పట్టపగలే ఉపాధ్యాయుల ఇళ్లల్లో చొరబడి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గాజుల క్రిష్టప్ప వీధిలో ముగ్గు వేస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దుండగుడు బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. విజయనగర్‌కాలనీ, మెయిన్‌బజారు, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లో బయట పార్కింగ్ చేసిన వాహనాలను సైతం ఎత్తుకెళుతున్నారు. వరుస చోరీలతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్లలేక పోయారు. రాత్రి సమయాల్లోనే కాదు పట్టపగలు కూడా దొంగలు విరుచుకుపడుతున్నారు.


నిద్రమత్తు వీడేదెన్నడో..?

పట్టణంలో మట్కా, పేకాట, చోరీలు వరుసగా జరుగుతున్నా పోలీసులు నిద్రమత్తు వీడడం లేదు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విస్తరిస్తున్న మట్కా' కథనానికి స్పందించిన పోలీసు అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. కూకటివేళ్లతో సహా నిర్మూలించాల్సిన పోలీసులు ఆ వైపుగా అడుగులు వేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చోరీలపై పోలీసులు పట్టించుకోకపోవడంతో దొంగలకు తాడిపత్రి అడ్డాగా మారిపోయింది. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు నిద్రమత్తు వీడలేదనే విమర్శలు ఉన్నాయి.



బీరువాను పగలగొట్టిన దొంగలు (ఫైల్)

కొరవడిన గస్తీ..



రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ కొరవడింది. ఏదైనా జరిగినప్పుడు మాత్రం ఆ రెండుమూడురోజులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించడం.. తర్వాత తిలోదకాలు ఇవ్వడం పోలీసులకు పరిపాటిగా మారింది. దొంగలు రాత్రి సమయాల్లోనే ఎక్కువగా చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. కానీ పోలీసులు రాత్రి డ్యూటీని మరచిపోయి చాన్నాళ్లు అవుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలోని ఇన్నిదాడులు, దొంగతనాలు జరుగుతున్నా పోలీసులకు చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక టీం



చోరీల నిర్మూలనపై ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. సీసీ పుటేజీల్లో కనిపించిన వ్యక్తులపై నిఘా పెట్టాం. దొంగలను పట్టుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాం.

-సాయిప్రసాద్, పట్టణ సీఐ

బెల్టు తీసేదెవరు..?

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు 223

- బెల్టు షాపుల సంఖ్య 1200కు పైమాటే
- ప్రతి మద్యం దుకాణానికి అనధికారిక పర్మిట్ రూములు
- మిలటరీ మద్యం పేరుతో జోరుగా విక్రయాలు
- కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్ల అక్రమ రవాణా
- నియంత్రణకు అధికారుల మీనమేషాలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం



అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా... ఎవరైనా ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదు. బెల్టుషాపుల వ్యవహారంలో కలుగజేసుకుంటే బెల్టు తీస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పదే పదే చెబుతూ వచ్చారు. బెల్టుషాపుల నిర్వహణలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నా సీరియస్‌గా పరిగణిస్తానని ఆయన ప్రతి వేదికలోనూ ఆదేశించారు. అధికారులను సైతం అదే స్థాయిలో హెచ్చరించారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీఎం ఆదేశాలకు భిన్నంగా బెల్టుషాపుల నిర్వహణ మూడు క్వార్టర్లు ఆరు ఫుల్లుగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా... 223 మద్యం దుకాణాలుంటే... వాటి పరిధిలో ఇప్పటికే 1200కుపైగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారంటే... ఊరూరా షాపులు వెలిశాయన్నది నిర్వివాదాంశం. బెల్టుషాపులను అరికట్టాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

ఉమ్మడి జిల్లాలో మెజార్టీ మద్యం దుకాణాలు కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాల పరిధిలో దాదాపు వందకుపైగా ఆ వర్గాలకు చెందినవే. సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాల్లో 70కిపైగా కూటమి నేతలవే. ఈ నేపథ్యంలో ఆయా మద్యం దుకాణాల ద్వారా మద్యాన్ని బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాల నుంచి మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే కొనుగోలు చేసిన బెల్టుషాపు నిర్వాహకులు మందుబాబులకు క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.30లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం విక్రయాలు పెద్ద మొత్తంలో జరగడం ద్వారా ప్రభుత్వం నుంచి వస్తున్న పర్సంటేజీ పెరుగుతుందనే ఆశతో దుకాణాల నిర్వాహకులు బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఊరూరా బెల్టుషాపులు ఏర్పడటానికి మద్యం దుకాణాల నిర్వాహకులే ప్రధాన కారణమన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ప్రోత్సాహంతోనే బెల్టుషాపుల నిర్వహణ కొనసాగుతోందన్న విమర్శలు లేకపోలేదు.

అనధికారిక పర్మిట్ రూములు

అనధికారిక పర్మిట్ రూముల నిర్వహణ... ప్రతి మద్యం దుకాణానికి పక్కనే అనధికారికంగా పర్మిట్ రూమును ఏర్పాటు చేసుకొని అక్కడే మద్యం తాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకుల ప్రమేయమనడంలో ఎలాంటి సందేహం లేదు. పర్మిట్ రూములను ఎవరు అడ్డుకుంటారనే ధీమా ఆ వర్గాల్లో ఉండటంతోనే నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోనే ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏ మద్యం దుకాణానికి వెళ్లినా పక్కనే పర్మిట్ రూము ఏర్పాటు చేసుకొని దర్జాగా మద్యం తాగించేస్తున్నారు.



మిలటరీ మద్యం పేరుతో..

మిలిటరీ మద్యం పేరుతో ఎమ్మార్పీ లేకుండా జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రోజుకు పెద్ద మొత్తంలో మద్యం విక్రయిస్తున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణంలో లభించే ఫుల్ బాటిల్ కంటే... 40 నుంచి 50 శాతం తక్కువ ధరకు మిలిటరీ మద్యం పేరుతో మద్యాన్ని విక్రయిస్తుండటంతో ఎక్కువ మంది మందుబాబులు ఆ మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కడ పార్టీలు జరిగినా... మిలిటరీ మద్యమే దర్శనమిస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో మిలిటరీ మద్యం ఎక్కడ నుంచి సరఫరా అవుతోందో అంతుపట్టని పరిస్థితి. మిలిటరీలో పనిచేసే సైనికులు, మాజీ సైనికులకు మాత్రమే ఆర్మీ క్యాంటిన్‌లో వారి వారి హోదాను బట్టి కేటాయించిన లిక్కర్ కార్డుకు నెలకు నాలుగు నుంచి 8 ఫుల్‌బాటిళ్లు అందజేస్తున్నారు. ఇందులో కొందరు వారి సొంత అవసరాలకు వినియోగించుకోగా... మరికొందరు బయటి వ్యక్తులకు ఆర్మీలో లభించే ధర కంటే రూ.200 నుంచి రూ.300కు అధికంగా విక్రయిస్తున్నారు. అలా అని ఆర్మీ క్యాంటిన్ ద్వారా పంపిణీ చేసే మద్యం, బయట వ్యక్తులు మిలిటరీ మద్యం పేరుతో విక్రయిస్తున్న మద్యానికి పొంతన లేకుండా పోతోంది. దీని వెనుక మిలిటరీ మద్యం పేరుతో ఇతర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు పెద్ద ఎత్తున మద్యం రవాణా అవుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉండగా.... ప్రైవేట్ మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్ అంటే 180 ఎంఎల్ రూ.99లకు లభిస్తోంది. ఈ నేపథ్యంలో... కొందరు మద్యం విక్రయదారులు, బెల్టుషాపు నిర్వాహకులు ఉమ్మడి జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లోని బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రూ.45లకు లభించే టెట్రా ప్యాకెట్లను భారీ ఎత్తున కొనుగోలు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాల్లో విచ్చలవిడిగా..

ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన బార్లలో మాత్రమే మద్యం తాగేందుకు అనుమతులున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో ఏ రెస్టారెంట్, హోటల్, డాబాలకు వెళ్లినా జోరుగా మద్యం తాగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక జాతీయ రహదారి పొడవునా ఉన్న మెజార్టీ హోటళ్లలో నిర్భీతిగా మద్యం తాగేందుకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశారు. గుత్తి సరిహద్దు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోనూ అదే ఒరవడి కొనసాగుతోంది. ఇలా ఎక్కడికక్కడ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

మామూళ్ల మత్తు

ఉమ్మడి జిల్లాలోకి పెద్ద ఎత్తున గోవా మద్యం దిగుమతైనా... ఊరూరా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా... మిలిటరీ మద్యం పేరుతో జోరుగా విక్రయాలు సాగిస్తున్నా... హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లల్లో మద్యం తాగిస్తున్నా... కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లు దిగుమతి చేసుకుంటున్నా... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములు నిర్వహిస్తున్నా... నియంత్రించే నాథుడు కాదు కదా... పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు బాధ్యతలను విస్మరిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీని వెనుక అటు సివిల్ పోలీసులు, ఇటు ఎక్సైజ్ పోలీసులు పరస్పర అవగాహనతో నియంత్రణపై చొరవ చూపలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే నియంత్రణ మరిచి నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై బెల్టు తీసేదెవరో అధికార యంత్రాంగమే సెలవివ్వాలి.

సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ముదిగుబ్బ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఈదులపల్లి వైసీపీ మద్దతు సర్పంచ్ ప్రభాకరరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైసీపీ హయాంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఓ యువతికి మాయమాటలు చెప్పి 2021లో సర్పంచ్ పెళ్లి చేసుకున్నాడు. రహస్యంగా అనంతపురంలో పెట్టాడు. 2022లో ఆమెకు కుమారుడు పుట్టి, మరణించాడు. ప్రస్తుతం ఆమె రెండు నెలల గర్భవతి. ఈ నేపథ్యంలో తనను వదిలించుకోవడానికి కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ ప్రభాకర్ రెడ్డికి ఇదివరకే వివాహమైంది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

రాష్ట్రం మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి వేడుకలను నిర్వహించిరు. నారా లోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎంపీ అంబికా

గార్లదిన్నె, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అట్టహసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. గార్లదిన్నె బస్టాండ్ సర్కిల్లో పార్టీ జెండా ఎగుర వేసి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ నాయకులు ముంటి మడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, శేఖర్, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, రామలింగారెడ్డి, ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌చౌదరి, గేటుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ, పాండు, ఇల్లూరు రామాంజి, గుత్తాబాలకృష్ణ, జయారం, వెంకట్రామిరెడ్డి, నరసింహరెడ్డి, చితంబరప్ప, సుంకన్న, సురేష్‌బాబు, పుల్లన్న, గుర్రం శీనా, వెంకటేష్, సుబ్బయ్య, చిరుతల గోపాల్‌రెడ్డి, రామకృష్ణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

● అనంతపురం రూరల్: మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరై కేక్‌కట్ చేశారు.మంత్రి లోకేశ్‌కు ఫోన్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు

● అనంతపురం కల్చరల్: ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులతో పాటు ఆర్టీసీ కార్మిక పరిషత్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వాసుదేవరెడ్డి, ఈడీ ఆంజనేయులు, రాధాకృష్ణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో వెల్‌నెస్ క్లినిక్



వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న మాణిక్యాలరావు, వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజనాస్పత్రిలో వెల్‌నెస్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, ఆస్పత్రి సూపరింటెం డెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు గురువారం ప్రారంభించారు. వికసిత భారత్ ఆధారంగా స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా వెల్‌నెస్ క్లినిక్ సేవలు చేపట్టినట్టు తెలిపారు. వారానికి రెండు రోజుల పాటు సోమ, బుధవారాల్లో సేవలు అందిస్తామని వారు తెలిపారు. ఈ క్లినిక్‌ను సామాజిక వైద్య విభాగం (ఎస్‌పీఎం) పర్యవేక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎంఓలు డాక్టరు హేమలత, డాక్టరు పద్మజ, ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టరు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయం-2 విజయవంతం చేయండి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



సిబ్బందితో మాట్లాడుతున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

బుక్కరాయసముద్రం, జనవరి23(ఆంధ్రజ్యోతి): ఏపీని సారా, గంజాయి లేని రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయం -2 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ నాగమద్దయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక ఎక్సైజ్‌స్టేషన్‌ను డిప్యూటీ కమీషనర్‌తో పాటు జిల్లా సూపరింటెండెంట్ రామ్మెహన్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల29న గంజాయి నిర్మూలన కోసం నవోదయం కార్యక్రమంను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా నాటు సారా, బెల్టుషాపులు, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత గంజాయికు అలవాటు పడకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు నిర్వహిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు విక్రయదారులు, నాటుసారి విక్రయదారులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఎవరైనా సరే అక్రమంగా నాటు సారా, బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ తదితరులు పాల్గొన్నారు.

దేవళ్ల మురళికి సన్మానం

అనంతపురం అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన దేవళ్ల మురళిని టీడీపీ నాయకులు, తెలుగు మహిళలు ఘనంగా సన్మానించారు. గురువారం స్థానిక టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర్ చౌదరి క్యాంపు కార్యాలయంలో దేవళ్ల మురళికి శాలువా కప్పి, పూల మాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బంగి నాగ, మారుతీకుమార్ గౌడ్, మార్కెట్ మహేష్, సురేంద్ర, కుమార్, శంకర్, తెలుగు మహిళలు విజయశ్రీరెడ్డి, వసుంధర, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ఇళ్లు

● దిష్టిబొమ్మలను తలపిస్తున్న వైనం



కురుగుంట సమీపంలో నిర్మాణం పూర్తయి ఇళ్లు

అనంతపురం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పలువురు పేదల సొంతింటి కల.. కలగానే మిగులుతోంది. పేదల సొంతింటి కల సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలు స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మా ణాలకు నిధులు మంజూరు చేస్తున్నాయి. అయితే మండలంలోని పలు ప్రాంతాల్లో స్థానిక పాలకులు, అధికారుల నిర్ణయాల్లో చోటు చేసుకుంటున్న జాప్యం కారణంగా పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఇళ్ల నిర్మించినా వాటిని ప్రారంభించక పోవడంతో నిరుపయోగంగా ఉ న్నాయి. అనంతపురంరూరల్ మండలంలోని ఇళ్ల దుస్థితే ఇందుకు ని లువెత్తు నిదర్శంగా నిలుస్తున్నాయి. నిర్మాణాలు పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఆ గృహాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

నిర్మాణం పూర్తయినా...

అనంతపురంరూరల్ మండలం కురుగుంట గ్రామ సమీపంలో గత ప్రభుత్వం హయంలో అర్బన్ -ఎ లేఅవుట్‌లో 1040 స్థలాలను నగరంలోని పేదలకు కేటాయించారు. 850 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇందులో 450 ఇళ్లను ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్మించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80లక్షలు కేటాయించింది. దీనికి అదనంగా లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ. 35వేలు దాకా రుణం చేశారు. దీనికి తోడు ఆర్డీటీ ఇళ్ల నిర్మాణాలు మరింత బాగుండాలన్న సదుద్దేశంతో తమ వంతుగా రూ.20 నుంచి రూ. 25వేల వరకు కేటాయించినట్లు తెలుస్తోంది. ఆ మేరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయి ఏడాది కావస్తోంది. అయితే ఇప్పటి వరకు ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. ఇళ్ల ప్రారంభం కాకపోవడంతో ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. గృహాలు ప్రారంభిస్తే లబ్ధిదారులకు మేలు జరిగే అవకాశం ఉంది. ఆ దిశగా అధికారులు, పాలకులు చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అనుమతులు రాగానే ప్రారంభిస్తాం

అర్బన్-ఎ లేఅవుట్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో 450 ఇళ్ల నిర్మించారు. నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిని ఈ నెలలో సంక్రాంతికి పారంభించాల్సి ఉంది. కానీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియ వాయిదా పడింది. అనుమతులు రాగానే ఇళ్లను ప్రారంభిస్తాం. - రాజేష్, ఏఈ, హౌసింగ్, అనంతపురం అర్బన్

నగరంలో భారీ ఆటో ర్యాలీ



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యేలు దగ్గుపాటి, ఎంఎస్ రాజు



ఆటో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో భారీ ఆటో ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు ముఖ్యఅతిథులుగా హాజరై ఆటో ర్యాలీని ప్రారంభించారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఆటో నడిపి కార్యకర్తలను ఉత్సాహపర్చారు. స్థానిక కేఎస్‌ఆర్ కళాశాల నుంచి ఎన్టీఆర్ విగ్రహం దాకా ఆటో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం ఎదుట భారీ కేక్‌ను కట్ చేసి నారాలోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ మాట్లాడుతూ... యువగళం పాదయాత్రతో నారా లోకేశ్ చరిత్ర సృష్టించారన్నారు. ఆయన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ప్రతి ఇంట ఒక పారిశ్రామికవేత్త రావాలనే లక్ష్యంగా నారాలోకేశ్ ఆధ్వర్యంలో పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ... కార్యకర్తలకు నిజంగా అండగా ఉండే నాయకుడు నారాలోకేశ్ అన్నారు. అందుకే ఆయన్ను లక్షలాది మంది అభిమానిస్తున్నారన్నారు. నాయకులు బల్లా పల్లవి, రాయల్ మురళీ, సరిపూటి రమణ, గంగారామ్, ఇస్మాయిల్, లక్ష్మీనరసింహ, కుంచెపు వెంకటేష్, పరమేశ్వరన్, కడియాల కొండన్న, కృష్ణకుమార్, ఓంకార్‌రెడ్డి, డేగల కృష్ణమూర్తి, సైపుద్దీన్, గోపాల్ గౌడ్, నెట్టం బాలకృష్ణ, చేపల హరి, వెంకటప్ప, రాంబాబు, మణి కంఠ బాబు, లక్ష్మీనాయుడమ్మ, సాకే రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం అర్బన్ కార్యాలయంలో...

టీడీపీ అనంతపురం అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో నారాలోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే దగ్గు పాటి కేక్ కట్ చేసి నారాలోకేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీ పీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు గడ్డం సుబ్రహ్మణ్యం, ప్రకాష్‌నాయుడు, రాయల్ మురళీ, తలారి ఆదినారాయణ, కడియాల కొండన్న, పరమేశ్వరన్, చరిత, వడ్డే భవాని తదితరులు పాల్గొన్నారు.

తలగాసిపల్లి పాఠశాల నిర్మాణానికి కృషి చేస్తా : ఎంపీ

గార్లదిన్నె, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హజరయ్యారు. ఈ సందర్భంగా తలగాసిపల్లిలో ప్రాథమిక పాఠశాలకు సొంతభవనం లేక పోవడంతో ఆర్డీటీ భవనంలో పాఠశాలను నిర్వహిస్తున్నామని ఎంఈఓ తారా చంద్రనాయక్ ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పాఠశాల భవనం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లలరేవు గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రాప్తాడు తహసీల్దార్ విజయకుమారి, సీఐ శ్రీహర్షకు వినతి పత్రం అందచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో సర్వే నెంబర్ 103-2లో 4.90 ఎకరాలు, 103-3లో 2.86 ఎకరాల ప్రభుత్వ భూమిని వైసీపీ నాయకులు ఆక్రమించారని వారు తెలిపారు. రెవెన్యూ అధికారులు పరిశీలించి ఆ భూమిని గ్రామ ప్రజల అవసరాల కోసం ఉపయోగించాలని కోరారు. కార్యక్రమంలో పుల్లలరేవు గ్రామస్థులు గోపాల్, రమేష్, అక్కులప్ప, సుధాకర్, శంకరయ్య, క్రిష్టయ్య, శంకరనాయుడు, నరసింహులు, లక్ష్మన్న, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కంది పంటకోత ప్రయోగం

అనంతపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులో గురువారం వ్యవసాయాధికారులు కంది పంటకోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన రాగే పరశురాముడి పొలంలో గురువారం దిగుబడులను అంచనా వేశారు. ఎకరాకు 1. 82 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కార్యక్రమంలో ఏఈఓ మురళి పాల్గొన్నారు.

గొల్లపల్లిలో పశువైద్య శిబిరం

రాప్తాడు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లిలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులు, దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగించారు. గర్భకోశ వ్యాధులున్న పశువులకు చికిత్స చేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రకాష్, పశు వైద్య సిబ్బంది పద్మావతమ్మ, నరేష్, ఉమాశంకర్, దివ్యశ్రీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతకు మారుపేరుగా మార్చండి

● డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక ధర్మవరం సబ్‌డివిజన్‌లో శాంతి భద్రతలు బాగున్నాయని, ఈ ప్రాంతాన్ని ప్రశాంతతకు మారుపేరుగా మార్చాలని ధర్మవరం నూతన డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం ఎమ్మెల్యే పరిటాల సునీతను డీఎస్పీ హేమంత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. అనంతరం వెంకటాపురంలో శుక్రవారం జరగనున్న పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై డీఎస్పీ సమీక్షించారు. సమీక్షలో టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి తదితరులు ఉన్నారు.

'చివరి ఆయకట్టుకు నీరివ్వాలి'

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పీఏబీఆర్ కుడికాలువ కింద చివరి ఆయకట్టు వరకు నీరిచ్చి, పంటలను కాపాడాలని జిల్లా పండ్లతోటల రైతుసంఘం నాయకులు కోరారు. వారు గురువారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఏబీఆర్ కుడికాలువకు నీటిని వదిలారని...అయితే చివరి చెరువు, ఆయకట్టుకు నీరు అందడం లేదన్నారు. కుడికాలువ కింద ఉన్న చెరువులన్నింటికీ తుంగభద్ర జలాలు ఇవ్వాలన్నారు. జిల్లా పండ్లతోటల రైతుసంఘం అధ్యక్షుడు అనంతరాముడు, నాయకులు నారపరెడ్డి, ఆనంద్, మురళీమోహన్ చౌదరి, రంగాచారి, పవన్, సూరి పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్ర పోస్టర్ల విడుదల

అనంతపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ నిత్యాన్నదాన నిలయం సందర్భనార్థం చియ్యేడు సాంఘిక ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో చేపట్టిన విజ్ఞాన విహార యాత్ర పోస్టర్లను విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శామ్యూల్ విడుదల చేశారు. జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ఆయన చేతుల మీదుగ జేఎన్‌టీయూ కళాశాలలో పోస్టర్లను విడుదల చేయించారు. ఆర్‌జేడీ సుబ్బారావు, జిల్లా విద్యాశాఖాధికారి ప్రసాద్‌బాబు, డీసీఈబీ గంధం శ్రీనివాసులు, ఏపీసీ శైలజా, ఎంఈఓ వెంకటస్వామి పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

అనంతపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమని మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ అన్నారు. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలోని రాజహంస గోల్డెన్ హోమ్స్ నుంచి చమన్ ఫంక్షన్ హాల్ వరకు రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మించనున్నట్లు తెలిపారు. అందుకోసం స్థానిక రోడ్డును మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి హిదయతుల్లా తదితరులు గురువారం పరిశీలించారు.

ప్రతిభకు వేదిక క్విజ్ పోటీలు

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసే వేదికలు క్విజ్ పోటీలని ఎస్కేయూ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ కృష్ణకుమారి పేర్కొన్నారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని ఎస్కేయూ క్యాంపస్ కేంద్రీయ విద్యాలయంలో పరాక్రమ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కెండేయులు అధ్యక్షతన ఉమ్మడి జిల్లాలోని పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీలను కృష్ణకుమారి ప్రారంభించారు.

విద్యార్థి ఆత్మహత్యపై సంఘాల ఆందోళన



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం విద్య, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యపై పలు విద్యార్థి, కుల సంఘాల నాయకులు ధర్నాకు దిగారు. విద్యార్థి చరణ్ కాలేజ్ బిల్డింగ్ నుంచి దూకి ఆత్మహత్య చేసుకోవడంతో.. ఆ కాలేజ్ వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్‌బీ, ఇతర విద్యార్థి సంఘాల నాయకులు ఆర్ఐఓ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంక్రాంతి సెలవుల తర్వాత విద్యార్థి చరణ్ కాలేజ్ హాస్టల్ వద్దకు వస్తే... పెండింగ్ ఫీజు కోసం సుమారు అరగంట బయట నిలబెట్టి, లోపలికి రానివ్వలేదన్నారు. మరో రెండు రోజుల్లో కడుతామని విద్యార్థి తండ్రి చెప్పినాకనికరించలేదన్నారు. కళాశాల యాజమాన్యం లక్షలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా, ఆర్ఐఓ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ ఘటనకు సంబంధించి కళాశాల యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆర్ఐఓ విచారణ చేసి, వెంటనే కళాశాలను సీజ్ చేయాలని కోరారు. విద్యార్థి సంఘాల నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, సురేష్ యాదవ్, పృథ్వి, సిద్ధు, జయ వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీకి ఫిర్యాదు

విద్యార్థి ఆత్మహత్య ఘటనపై ఆసుపత్రి మార్చురీ వద్ద ఉన్న అనంతపుం రూరల్ డీఎస్పీ వెం కటేశ్వర్లను ఎస్సీఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు సాహే హరి, ఇతర విద్యార్థి సంఘాల నేతలు కలిశారు. వారు మాట్లాడుతూ... కళాశాలలో ఫీజుల వేధింపుల వల్లే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. దీనిపై లోతైన దర్యాప్తు చేసి, అందుకు బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.ఈ మేరకు డీఎస్పీకి వినతిపత్రం ఇచ్చారు.

న్యూస్ బాక్స్

రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలి: డీఎస్పీ

చెన్నేకొత్తపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరు రోడ్డు నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని ధర్మవరం నూతన డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవా లలో భాగంగా గురువారం స్థానిక ఉన్నతపాఠశాల విద్యార్థులతో కలిసి పోలీసులు చెన్నేకొత్తపల్లిలో ర్యాలీ చేపట్టారు. స్థానిక బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.... రహదారి భద్రతలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిం చారు. రోడ్డు నిబంధనలను పాటించని వారిపై చర్యలు తీసుకుం టామన్నారు. కార్యక్రమంలో రామగిరి సీఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణ, ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్ నాయుడు, హెచ్‌ఎం ఓబుళమ్మ, ఉపాధ్యాయులు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 11మంది ఎంపిక

అనంతపురం రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు రోడ్డులో ఉన్న పీవీకేకే పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో 11 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. కళాశాలలో గురువారం టోరే టెక్స్ టైల్స్ సంస్థ ఆధ్వరంలో ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈఈఈ, మెకానికల్ ఇంజనీరింగ్ వి ద్యార్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 11 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపా రు. వారిని వార్షిక ఆదాయం రూ. 2.09 లక్షలప్యాకేజీతో ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ పల్లె కిశోర్, కళాశా ల కోశాధికారి పల్లె సింధూరరెడ్డి తదితరులు అభినందించారు. స్పెషల్ ఆఫీ సర్ శ్రీనివాసులురెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, సొసైటీ ప్రాంగణ నియామకాల అధికారి బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిపై దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉన్న పది బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన ఇందుకు సంబంధించన వివరాలను విలేకరులకు తెలిపారు. పట్టణంలోని భంభంస్వామి ఏరియాలో నివాసముంటున్న ఎరుకుల నాగరాజు ఇంట్లో కర్ణాటక మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో వెంటనే దాడులు చేశామన్నారు. ఆ ఇంట్లో తనిఖీ చేయగా.. పది బాక్సుల టెట్రాప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఎరుకుల నాగరాజు, చాకలి విశ్వనాథ్ పరారైనట్లు తెలిపారు. రూ. 50 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. దాడుల్లో ఎస్ఐ పవన్‌కుమార్, పీసీలు సోము, వెంకటేశులు, లాలు, కవీంద్ర, శాంతి పాల్గొన్నారు.

త్వరలోనే కందుల కొనుగోలు కేంద్రాలు

కూడేరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీ నారాయణపురం, ముద్దలాపురం గ్రామాల్లో త్వరలోనే కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఏఓ విజయ్‌కుమార్ తెలిపారు. పీ నారాయణపురం గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కందుల మద్దతు ధరను క్వింటాకు రూ.7550 నిర్ణయించిదన్నారు. వీటిని లక్ష్మీనరసింహ స్వామి రైతు ఉత్పత్తి దారుల సంఘం కొనుగోలు చేస్తుందన్నారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు త్వరగా రైతు సేవాకేంద్రాల్లో తమ పేర్లు రిజిస్టర్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

పేర్లు నమోదు చేసుకోండి..

విడపనకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి కందులను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని ఏఓ పెన్నయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. కందులను విక్రయించే రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అనంతరం ఉరవకొండలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రానికి కందులను తీసుకెళ్లి విక్రయించాలన్నారు. రైతులు ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, పట్టాదారు పాస్‌బుక్కు జిరాక్స్‌లు తీసుకెళ్లాలని సూచించారు. కందుల్లో 12 శాతం తేమ ఉండేలా చూసుకోవాలన్నారు. 12కి మించి తేమ ఉంటే కొనుగోలు చేయరన్నారు. రైతు లు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంతకల్లుటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కసాపురం గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వారు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ హాజరై వాటిని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఐదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వీటిని అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకుని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాయల్ రంగ, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి లావణ్య, పాఠశాల హెచ్ఎం నాగేంద్రప్ప పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గడేహోతూరుకు చెందిన ధర్మతేజకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.1.64లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన చెక్కును టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు అనంతపురంలోని రాంనగర్‌లో గల తన నివాసంలో గురువారం లబ్ధిదారుడికి పంపిణీ చేశారు. ప్రభుత్వ అందజేసే సాయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. టీడీపీ నాయకులు వన్నూరుస్వామి, భీమలింగప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైలు వంతెనల సమస్యలు పరిష్కరించండి

● డీఆర్ఎంకు ఎమ్మెల్యే జయరాం వినతి

గుంతకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రైలు వంతెనల సమస్యపై దృష్టిని సారించి, వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కోరారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని రైల్వే డీఆర్ఎం కార్యాలయంలో డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ధర్మవరం గేటు వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని, గతంలో నిర్ణయించిన విధంగా కాకుండా వంతెన ఎత్తును పెంచాలని, బళ్లారి బైపాస్‌లో రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీని నిర్మించాలని, కసాపురం రోడ్డులో ఉన్న రైలు వంతెన వెడల్పు పనులను త్వరితగతిన చేపట్టాలని విన్నవించారు. సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని డీఆర్ఎం హామీ ఇచ్చారు. డీఆర్ఎంను కలిసిన వారిలో మున్సిపల్ కమిషనరు నయీం అహ్మద్, టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు ఈశ్వర్, బండారు ఆనంద్, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

అటవీ అధికారులకు జింకపిల్ల అప్పగింత

ఉరవకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని లత్తవరం గ్రామ పొలాల్లో తిరుగుతున్న జింక పిల్లను గురువారం రైతు పట్టుకుని అటవీ అధికారులకు అప్పగించారు. పొలాల్లో జింక పిల్లను కుక్కలు తరుముతుండగా రైతు నరసింహాచారి గమనించాడు. వెంటనే దానిని కుక్కల బారి నుంచి కాపాడారు. తర్వాత పట్టుకుని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌కు అప్పగించాడు.

గొర్రెల మృతిపై విచారణ

పెద్దవడుగూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండూరులో గత అర్ధరాత్రి గొర్రెలు లేత జొన్న పంటను తినడం వలన చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో పశుసంవర్ధకశాఖ డివిజనల్ ఉప సంచాలకులు డాక్టర్ వై. రమేష్‌రెడ్డి, గుత్తి ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జి సహాయ సంచాలకులు డాక్టర్ జి. పద్మనాభం గురువారం ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. గొర్రెల కాపరులు రామకృష్ణ, సన్నప్ప, సుంకన్న, గోపాల్, నరసింహుడు, నారప్ప, నాగభూషణ సుమారు 57 గొర్రెలు చనిపోయినట్లు తెలియజేశారు. వీటివిలువ రూ.4లక్షలు ఉంటుందన్నారు. లేత జొన్న మొక్కలను తినడం వల్లనే అవి చనిపోయాయని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. లేత జొన్న మొక్కల్లో హైడ్రోజన్ సైనైడ్ అనే విష పదార్థం ఉంటుందని, వాటిని తినడం వలన గొర్రెలు మృతిచెంది ఉంటాయని వారు కాపరులకు సూచించారు. పశువైద్యాధికారి కమల, టీడీపీ మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి ఉన్నారు.

నలుగురికి టీడీపీ శాశ్వత సభ్యత్వం

రాయదుర్గంరూరల్/కణేకల్లు జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాయదుర్గం మండల కన్వీనర్ హనుమంతు, గుమ్మఘట్ట మండలం క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్నతో పాటు కణేకల్లు మండలంలోని చిక్కణ్ణేశ్వర చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, నాయకుడు చంద్రశేఖర్ గుప్తా ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి పార్టీ శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. పట్టణంలోని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు నివాసంలో గురువారం వారు శాశ్వతసభ్యత్వాన్ని పొందారు. శాశ్వత సభ్యత్వ కార్డులను కాలవ శ్రీనివాసులు వారికి అందించారు. కార్యక్రమంలో నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, మాబుసాబ్, చాంద్‌బాషా, కురుబ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని అందిస్తున్న విప్ కాలవ

ఫ్లైఓవర్ సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

డి.హీరేహాళ్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండకేంద్రంలో గుదిబండలా మారిన నేషనల్ హైవే ఫ్లైఓవర్ సమస్య పరిష్కారానికి ఎంపీలతో కలిసి కేంద్రం దృష్టికి తీసుకెళతానని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. గ్రామస్థులు గురువారం ఫ్లైఓవర్ సమస్యపై స్థానికంగా సమావేశం నిర్వహించారు. ఇందులో బళ్లారి ఎంపీ తుకారంతో పాటు కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ.. ఈ సమస్యకు ఢిల్లీలో పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మండలకేంద్రాన్ని విడదీసేలా మట్టితో కాకుండా పిల్లర్ల విధానం ద్వారా ఫ్లైఓవర్‌ను నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారన్నారు. వైసీపీ పాలనలో అప్పటి పాలకులు ప్రజాభీష్టాన్ని పరిగణలోకి తీసుకోకపోవడం వల్లే సమస్య జఠిలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపాదన దశలోనే స్థానికులను సమావేశ పరచి నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదన్నారు. ప్రస్తుతం గ్రామస్థులు వ్యక్తపరుస్తున్న సమస్య కేంద్రం పరిధిలోనే పరిష్కారం కావాలన్నారు. త్వరలో పార్లమెంట్ సమావేశాలు జరగనున్నాయని, అందులో అనంతపురం, బళ్లారి ఎంపీలతో పాటు మన రాష్ట్రం నుంచి ఎంపికైన కేంద్ర మంత్రుల సహకారంతో సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా లోకేష్ జన్మదినం సందర్భంగా కాలవ కేక్ కట్ చేశారు. సమావేశంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాల భవనం పరిశీలన..

డీ.హీరేహాళ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాన్ని విప్ కాలవ పరిశీలించారు. భవనం శిథిలావస్థలో ఉందని కొత్త భవనం మంజూరు చేయించాలని స్థానికులు కోరారు. విద్యాశాఖ దృష్టికి సమస్యను తీసుకెళ్లి నూతన భవనం మంజూరుకు ప్రయత్నం చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం స్థానిక జ్యోతిరావుపూలే సంక్షేమ పాఠశాలలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ నిఘంటువులను పంపిణీ చేశారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టండి

● అధికారులకు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ సూచన



సుంకులమ్మపాలెంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని సజ్జలదిన్నె ఊరుచింతల, తలారిచెరువు గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎక్కడా అపరిశుభ్రత లేకుండా ఉండేటట్లు చూడాలని తెలిపారు. కొందరు గ్రామస్థులు వివిధ సమస్యల్ని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఆయన ఆయా అధికారులను పిలిపించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పట్టణంలోని సుంకులమ్మపాలెం, గణేష్‌నగర్ తదితర కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలపై ఆరాతీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఆయన వెంట కౌన్సిలర్లు, అధికారులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

సజావుగా మండల సమావేశం



సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు, అధికారులు

శెట్టూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం సజావుగా జరిగింది. ఇందు లో శాఖల వారిగా ఆయా అధికారులు ప్రగతి నివేదికలను వినిపించారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు మంజునాథ్ మాట్లాడుతూ.. మండలంలో అయ్యగార్లపల్లి, బచ్చేహళ్లి, చెర్లోపల్లి, బసంపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీకేంద్రాలు అద్దెభవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులకు ప్రతిపాదన లు పంపుతామని సంబంధిత అధికారి వివరణ ఇచ్చారు. విద్యార్థులకు అపార్ కష్టాల నుంచి ఉపశమనం కల్పించాలని సభ్యులు ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన సమాధానమిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీవో రఘురామారావు, ట్రాన్స్‌కో అధికారి సలీమ్‌తో పాటు పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రంగచేడులో మెగా పశువైద్యశిబిరం

గుమ్మఘట్ట, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగచేడులో గురువారం మెగాపశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అనంతపురం స్పెషలాఫీసర్, అదనపు సంచాలకులు డాక్టర్ ఎన్ రజనీకుమారి, సంయుక్త సంచాలకులు వెంకటస్వామి, ఉరవకొండ ఉపసంచాలకులు వెంకటేష్, అనంతపురం పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ నాగలింగేశ్వర్, డాక్టర్ పీవీ సుధాకర్ హాజరై పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మరికొన్ని పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్సలు అందించారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ రజనీకుమారి మండలంలో పశువైద్య శిబిరాలు పనితీరుపై వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు.

ఆస్పత్రి ఏఓపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి

గుంతకల్లుటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఏఓ రాంప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయవాడలో వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ సిరికి గురువారం సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగినులు, వైద్యులపై ఏఓ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. మహిళా సిబ్బందిని ఏకవచనంతో సంబోధిస్తున్నారన్నారు. సెక్యూరిటీ సిబ్బందిని విధుల నుంచి తొలగిస్తామని బెదిరిస్తూ వారితో వేలాది రూపాయలు వసూలు చేశారన్నారు. ఆసుపత్రికి వచ్చిన నిధులను సైతం దుర్వినియోగం చేశారన్నారు. రాంప్రసాద్‌కు జిల్లా వైద్య అధికారులు, ప్రజాప్రతినిధులు అండదండలు ఉండటం వల్ల ఇప్పటి వరకు క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. మీరైనా స్పందించి ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓ ఇంటిపై దాడులు చేసి అక్రమంగా నిల్వ ఉన్న పది బాక్సుల కర్ణాటక మద్యాన్ని పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. పట్టణంలోని భంభంస్వామి ఏరియాలో నివాసముంటున్న ఎరుకుల నాగరాజు ఇంట్లో కర్ణాటక మద్యం అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారం రావడంతో వెంటనే దాడులు చేశామన్నారు. ఆ ఇంట్లో తనిఖీ చేయగా.. పది బాక్సుల టెట్రాప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. వెంటనే వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని నిల్వ ఉంచి విక్రయిస్తున్న ఎరుకుల నాగరాజు, చాకలి విశ్వనాథ్ పరారైనట్లు తెలిపారు. రూ. 50 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని త్వరలోనే పట్టుకుంటామన్నారు. ఎవరైనా కర్ణాటక మద్యాన్ని సరఫరా చేసినా, అమ్మకాలు చేసినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐ పవన్‌కుమార్, పీసీలు సోము, వెంకటేశులు, లాలు, కవీంద్ర, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

విడపనకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురంలో గురువారం రాత్రి జరిగిన ఇరువర్గాల ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. మాళాపురంలో రెండు రోజుల క్రితం ఊరి దేవర జరిగింది. ఇందులో దున్న పోతును బలి ఇచ్చే విషయమై మంగళవారం రాత్రి ఆ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. అప్పటికి గ్రామ పెద్దలు కలగజేసుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పి దేవరను సజావుగా సాగేలా చేశారు. గురువారం రాత్రి ఓ వర్గానికి చెందిన గోపాల్ మరొక వర్గానికి చెందిన ధనుంజయపై కర్రతో దాడి చేయగా.. తలకు బలమైన గాయమైంది. వెంటనే బాధితుడిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఈ గొడవలో గోపాల్ బంధువు అయిన వన్నూరుస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. సీఐ చిన్నగౌస్, ఎస్ఐ ఖాజా హుస్సేన్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు.

ఆవులదట్లలో మరో ఇద్దరికి..

రాయదుర్గంరూరల్: మండలంలోని ఆవులదట్లలో జరిగిన ఘర్షణలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికురాలైన వన్నూరమ్మ అల్లుడు కరెప్ప అక్కడే ఉన్న తన కుమారుడిని చూసేందుకు వచ్చాడు. అతను రవి, పండు, చంటి, మల్లికార్జునతో కలిసి వన్నూరమ్మ కుమారుడు రాజు, తమ్ముడు దేవరాజుతో ఘర్షణకు దిగి తీవ్రంగా గాయపరిచారు. గాయపడిన వారు రాయదుర్గం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

రోడ్డు ప్రమాద ప్రాంతాల పరిశీలన

గుంతకల్లుటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణ శివారులోని రోడ్డు ప్రమాద ప్రాంతాలను వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మనోహర్, మస్తాన్, ఎంవీఐ రాజబాబు గురువారం పరిశీలించారు. కొనకొండ్ల రోడ్డులోని మారెమ్మ ఆలయం, ఆలూరు రోడ్డులోని వాటర్ ట్యాంక్ ప్రదేశాలలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ, ఆలూరు రోడ్డులో వాహనదారులు ఈ ప్రాంతాలలో జాగ్రత్తగా ప్రయాణం చేయాలని సూచించారు. ఎస్ఐలు, రోడ్డురవాణా సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల ప్రారంభం

యాడికి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో అజ్యూర్ సోలార్ ప్రాజెక్ట్ కంపెనీ రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కాశప్ప మాట్లాడుతూ కార్పొరేట్ రెస్పాన్స్‌బిలిటీ ఫండ్ కింద అజ్యూర్ సోలార్ ప్రాజెక్ట్ కంపెనీవారు మూడు తరగతి గదులను నిర్మించడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఫర్నీచర్, గ్రీన్ బోర్డు, మరుగుదొడ్లను కూడా ఏర్పాటు చేశారని అన్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవంలో అజ్యూర్ సోలార్ కంపెనీ సీఎస్ఆర్‌టీం సభ్యులు మాన్సీ, మిశ్రా, గోపి, భరత్‌కుమార్‌రెడ్డి, అమృత్, ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీ, సర్పంచు ఓంకారమ్మ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై టీడీపీ నాయకుల ఆగ్రహం

ఉరవకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కందుల కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్ ఫొటోలు లేకుండా ఉండడంపై గురువారం స్థానిక టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం రైతులకు కూడా సమాచారం ఇవ్వకుండా, కందుల కొనుగోలు ప్రారంభించడమేమిటని అధికారులను ప్రశ్నించారు. దీంతో తహసీల్దార్ సిబ్బందిని పంపించి, సీఎం, మంత్రి ఫొటోలు ఉన్న ఫ్లెక్సీని వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

ఘనంగా నేతాజీ జయంతి

కుందుర్పి/ గుత్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయదార్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. హెచ్ఎం నల్లపల్లి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అలాగే గుత్తి పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి జేవీవీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ రంగన్న, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, నాయకులు శ్రీధర్‌గౌడ్, దేశాయ్‌నాగరాజు, చిదానంద, విజయ్‌భాస్కర్‌చౌదరి, నాగయ్య, కృష్ణ, రైల్వేకార్మికులు, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.



మాయదార్లపల్లి పాఠశాలలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులు

సావిత్రిబాయి పూలే జయంతి

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లిలో సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నడుస్తున్న విలువల బడిలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళల విద్యాభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డారని తెలిపారు. సమాజంలో వివక్ష, అంటరానితనం నిర్మూలనకు ఆమె చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు.



బెస్తరపల్లిలో సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద..

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు



గుంతకల్లులో విద్యార్థినులతో కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు పట్టణంలోని కేజీబీవీలో గురువారం సాయంత్రం లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులచేత కేక్ కట్ చేయించారు. అలాగే వారికి పుస్తకాలు, పెన్నులు తదితర విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. యువగళం పాదయాత్ర ద్వారా లోకేశ్ తన సత్తా ఏమిటో చాటారన్నారు. భవిష్యత్తు రాజకీయాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా ముఖ్య భూమికను పోషిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నాయకులు నారాయణ స్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కదిరప్ప, తలారి మస్తానప్ప, పత్తి హిమబిందు, ప్రభాకర్, శ్రీరాములు, రాము, నారాయణ, కేజీబీవీ సిబ్బంది, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి తన కార్యాలయంలో కేక్ కట్ చేశారు. నాయకులు బండారు ఆనంద్, కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేంద్రగౌడ్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్. పవన్‌కుమార్ గౌడ్‌తో కలిసి కేక్‌ను కట్ చేశారు. నాయకులు ఆర్. అనిల్‌గౌడ్, టీ.కేశప్ప, ఎం. రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ ఎంపీటీసీ సభ్యుడు అల్లుశీనా పట్టణంలోని తన కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఉరవకొండ: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు, మండల, పట్టణ కన్వీనర్లు విజయ్ భాస్కర్, రామాంజినేయులు, నాయకులు నాగేశ్వరరావు, తిమ్మప్ప, నెట్టెం రాంబాబు, యర్రగుంట్ల వెంకటేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో టీడీపీ నాయకులు పది కిలోల కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు తిమ్మరాజు, చంద్రశేఖర్, జడ్పీటీసీ సభ్యుడు హనుమంతు, టీడీపీ మండల నాయకులు హనుమంతు, రంగస్వామి, హంపి ఈరన్న, మాళాపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా, బోయ రమేష్, నాయకులు ప్రతాప్, న్యాయవాది సోమశేఖర్, కోనంకి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి ప్రాథమిక పాఠశాలలో టీడీపీ నాయకులు కేక్‌కట్ చేసి 70 మంది విద్యార్థులకు పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నాయకులు యర్రిస్వామి, దబ్బర మహేష్, స్రవంతి, రఘురాము, మల్లికార్జున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని కొండుగారికుంటలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు విజయ్‌కుమార్‌నాయుడు, రవిచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నాయకులు దస్తగిరి, నారాయణస్వామి, చిరంజీవులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి: మండలకేంద్రంలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, రాయలచెరువులో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్యల ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. కార్యక్రమాల్లో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూడేరు: మండల కేంద్రంలో జెండా కట్ట వద్ద టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సర్పంచు లలితమ్మ, నాయకులు పాల్గొన్నారు.

గుత్తిరూరల్: మండలంలోని బేతాపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో టీడీపీ మండల కన్వీనర్ బర్ధీవలి కేక్ కట్‌చేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ కార్యదర్శి సురేంద్ర పాఠశాల కమిటీ చైర్మన్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు పయ్యావుల అనిల్, పయ్యావుల శ్రీకాంత్ కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. స్థానిక కేజీబీవీలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. గిరీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: పట్టణంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి ఎన్‌టీఆర్ సర్కిల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

డీలర్ల సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కణేకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సంఘం మండల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కలవడికి ఎర్రిస్వామి, ఉపాధ్యక్షుడిగా జిలాన్, కార్యదర్శిగా మాల్యం ఎల్లప్ప, జాయింట్ కార్యదర్శిగా బెణెకల్లు ఎర్రిస్వామి, కోశాధికారిగా హనుమంతరాయుడును ఎన్నుకున్నారు. మండలకేంద్రంలో ఈ ఎన్నిక జరిగింది. డీలర్లు మహేష్, రఘు, ప్రసాద్, వన్నూరుస్వామి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాలో అంతరాయం

రాయదుర్గం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సరఫరాను శుక్ర, శని వారాల్లో పూర్తిగా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. వీరాపురం గ్రామం వద్ద ఉన్న పంప్‌హౌస్‌లో వాల్వులు, మోటార్లు చెడిపోయాయన్నారు. వీటిని మరమ్మతులు చేయడానికి గాను రెండురోజుల పాటు నీటి సరఫరాను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పుట్లూరు, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు గ్రామంలో గల రెండు అంగన్‌వాడీ కేంద్రాలను సీడీపీఓ భారతి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని సిబ్బందికి సూచించారు.

నేడు మండల సమావేశం

యాడికి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల సాధారణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోని సమావేశ భవనంలో ఉదయం 11గంటలకు సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. సభ్యులు, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.